# నీళ్ల ధార

రోడ్డు పక్కన బోర్‌నీళ్ల పంపు కనపడగానే టీచర్ వ్యాన్ ఆపమని డ్రైవర్‌కు సైగచేశాడు. వ్యాన్ ఆగింది.

" దప్పిక అయినవాళ్లు వెళ్లి నీళ్లు తాగిరండి" అన్నాడు.

వెంకట్, హరి యిద్దరు పంపువైపు నడిచారు. వెంకట్ పంపును కొడుతూ వుండగా హరి కాళ్లు చేతులను కడుక్కొని వొంగి దోసిలి పట్టుకొని కడుపునిండా నీళ్లు తాగాడు. ఆ తరువాత వెంకట్ పంపును వొదిలి హరిని తీసుకొమ్మని సైగ చేశాడు. హరి తడిచేతులను ఓసారి గాలిలో దులిపి వెళ్లి పంపును పట్టుకొని.

"చూడు కాళ్లు చేతులు కడుకుంటే కుదరదు,తాగు అంతే"అంటూ పంపును కిందికి పైకి కదిలించాడు. నీళ్లధార చాలా సన్నగా వస్తూవుంది. అది చూసి వెంకట్ -

"గట్టిగ కొట్టు, నేనూ కాళ్లూ చేతులు కడుక్కుని నీళ్లు తాగిందాక కొట్టు " అన్నాడు. కొట్టను అన్నట్టు చూశాడు.

ఎందుకు అన్నట్టు చూపుడు వేలు వూపాడు.

"ఆలస్యం అవుద్ది"

"నీకు కాలేదా"

" అయింది, నీకు కూడ అయితే వ్యాన్ ఆగుతుందామనకోసం"

"ఆగుతుందిలే కానీయ్"

"హ" అంటు హరి పంపుకొట్టకుండా వ్యాన్‌వైపు పరుగెత్తబోయాడు. చుట్టూవున్న కప్పపిల్లలు అటు యిటూ పరుగెత్తాయి. వెంకట్ అతన్నే వెంబడించి"ఎందుకు కొట్టవ్‌రా" అంటూ అతని చొక్కాపట్టూకొని నిలదీశాడు.

"వొదులు" "వొదలను" "కొడతాను" "తంతాను" ఈ దృశ్యాన్ని చూసిన టీచర్ మిగతా పిల్లలు వ్యాన్ దిగి వచ్చి యిద్దరినీ విడదీస్తూ కారణం అడిగాడు.యిద్దరు కోపంగా ఒకరిని ఒకరు చూసుకుంటున్నారే తప్ప నోరు విప్పడం లేదు. కొద్దిదూరం బీడులో పశువులను మేపుతున్న కాపరి వీళ్లవైపే చూస్తు నిల్చున్నాడు.

ఏమైంది చొక్కాలు పట్టుకున్నారు,ఎందుకు ? అడిగాడు టీచర్ కాస్త విసుగును ప్రదర్శిస్తూ కోపంతో బుసకొడుతూ వొకరినొకరు చూసుకుంటున్నారు. "ఎవరు చెప్పరే" మిగతా పిల్లల్లో నుండి ఒకడు అడిగాడు.

"వాన్నే చెప్పమనండి" వెంకట్ చూపుడు వేలితో చూపిస్తూ. హరి మౌనంగ చూస్తువున్నాడు.

"వీడు కాళ్లు చేతులు కడుక్కునే వరకు నేను పంపుకొట్టాను, మరి వీడు నాకుకొట్టడా?"

"కొట్టాలి" ఓ విద్యార్థి చెప్పాడు.

"కొట్టడట" దుఃఖం, కోపం రెండు కల్సిన గొంతుతో అన్నాడు వెంకట్.

"అంటే"

"ఒక్క తాగడానికే కొడతాడట, కాళ్లూచేతులు కడుక్కోడానికి కొట్టడట"

"అవునా హరి?" టీచర్ ప్రశ్నించాడు.

" అవును" అన్నట్టు తలాడించాడు, అమాయకుడిలా హరి.

"ఎందుకు?"టీచర్ అడిగాడు.

"ఎక్కువసేపు ఆలస్యమైతే వ్యాను వెళ్లిపోతది అని" అప్పుడతని కళ్లల్లో కొంటెతనం కదిలింది.

"ఆ విషయం నీవు కడుక్కునేటపుడు నీకు గుర్తులేదా?"

మౌనంగా నీళ్లు తాగినపుడు తడిసిన తన చొక్కా కొనను వేళతో కొడుతు నిలుచున్నాడు హరి.

"వీడు మాత్రం ఎంతసేపైనా కడుక్కోవచ్చు" వెంకట్ ఉక్రోషంగా అన్నాడు.

"చూడు యిది చాలా చిన్న విషయం కాని పెద్ద సమస్యను సృష్టించింది. హరి తనగూర్చే ఆలోచించి యితరుల గూర్చి వదిలేశాడు."

"కాదు సార్ వ్యాన్ వెళ్లిపోతే"--

" అవును ఆలస్యం అవుతే వెళ్లిపోయె అవకాశం వుంది, కాని అందర్ని తీసుకెళ్లవల్సిన బాధ్యత గూడ వుంది."

"డ్రైవర్ హారన్ యిచ్చాడు."

" అది పిలుపు మాత్రమే. అయినా నేనున్నానుగా, ఏది ఏమైనా ఈ సమస్యలు తెచ్చిపెట్టే పరిస్థితులను ఎవరూ కల్పించకూడదు. ముఖ్యంగా మీకు కల్పించిన ఐదు నిమిషాల వ్యవధిలో యిద్దరు ఒకే తీరుగా తమ తమ పనులను తీర్చుకునే విధంగా మెలగాల్సింది వుండే, అలా కాలేదు కనక కొట్టుకునే వరకు వొచ్చింది. ఈ సమస్యలో సమయం గూర్చి మనకు కనిపించినా, యిందులో స్వార్థం, సహనం యిమిడివున్నాయి. ఈ రెండు లక్షణాలను మనిషి మొదటినుండే అదుపుచేసుకోవాలి. మనిషితోపాటు అవి పెరిగి మానవున్ని దేవునిగా చేస్తాయి. గుర్తుంచుకోండి" అని టీచర్ కదలగానే అందరు వ్యాన్‌వైపు ఆయనతోపాటు నడుస్తున్నారు.

"గురజాడ గారు మీకు తెలుసా"?

" తెలుసు సార్ కవి, వారి సూక్తులు మనస్కూల్లో గోడలమీద రాసారు కదా1"

" ఆయన కవి మాత్రమే కాదు, గొప్ప సంఘ సంస్కర్త, కన్యాశుల్కం నాటక రచయిత కూడా"

" ఆయన ఏమన్నాడో ఓసారి గుర్తుచేసుకోండి, 'సొంతలాభం కొంతమాని పొరుగువారికి తోడుపడవోయ్' దానిని ఆచరించక

పోవటం వల్లనే ఈ అరాచకాలు పెరిగిపోతున్నాయి. కవి మాటలను కాదనకూడదు, రేపు కాబోయె ఈ దేశపౌరులు మీరు. గురజాడ మాటల్లోని అర్థాన్ని గ్రహిస్తేనే భవిష్యత్తుకు బంగారు బాటలు" అంటూ టీచర్ హరి చేతిలో వెంకట్ చేయిని వుంచాడు. యిద్దరు యిలాగే పంపు దగ్గరికి వెళ్లి హరి పంప్ కొట్టగ వెంకట్ కాళ్లు చేతులు కడుక్కొని నీళ్లు తాగాడు. ఆ తరువాత అందరు నీళ్లు తాగే వరకు, హరి, వెంకట్ పంప్ కొట్టారు. క్లీనర్ క్యాన్ నింపుకొచ్చుకొని కొన్ని రేడియేటర్‌లో పోసి మిగిలిన వాటిని తన కాళ్లదగ్గర పెట్టుకున్నాడు. ఆ తరువాత పిల్లలందరు కేరింతలు కొడుతూ వ్యాన్ ఎక్కారు.

"భద్రంగా కూర్చోండి చేతులు బయటికి పెట్టొద్దు" అంటూ టీచర్ ఎక్కి కూర్చోగానే వ్యాన్ కదిలింది.

"కవుల విషయమొచ్చింది కనుక చెపుతున్నాను తెలుగు సాహిత్యంలో మన అసలు సిసలు తేటతెలుగులో కవిత్వం చెప్పింది వేమనర్రా" టీచర్ అన్నాడు.

"ఉప్పుకప్పురంబు ఒక్క పోలికనుండు రాశాడు కదుసార్" -- రసూల్ అడిగాడు.

"చూడ చూడ రుచుల జాడవేరు" మూర్తి చెప్పాడు.

"పురుషులందు పుణ్యపురుషులు వేరయా" హరి అన్నాడు.

వెంటనే పిల్లలంతా కోరస్‌గా "విశ్వదాభిరామ వినురవేమ" అన్నారు.

"ఆ పద్యం చెప్పినాయనే, యింకా యిలాంటివి మనకు ఉపయోగపడే మంచి పద్యాలెన్నో చెప్పాడర్రా. నిజంగా ప్రజల సమస్యల గూర్చి రాసిన ప్రజాకవి ఆయనే. అంతేకాదు ఆయన ఎన్నో సమస్యల మీద పద్యాలు అల్లాడు. మానవజాతికి ఉపయోగపడే గొప్ప కవితా సాహిత్యాన్ని మనకు అందించాడు. వేమన మహాకవి మాత్రమే కాదు విశ్వకవి."

" కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా" చంద్రం చెప్పాడు.

" మీరంతా వేమన శతకం తప్పకుండా కంఠతాపట్టాలి మీకు మునుముందు చాలా ఉపయోగపడుతుంది."

" టీచర్ విద్యార్థులమధ్య జరుగుతున్న సంభాషణను డ్రైవర్ క్లీనర్ కూడ వింటూ ఉన్నారు. యాత్ర మొదలు అయ్యేటపుడు టీచర్ పెట్టిన షరతు " నిదానంగ నడపాలి" అన్న సూచన టీచర్‌ను చూసినపుడల్లా గుర్తు రావడంవల్ల వ్యాన్‌ను మామూలు స్పీడ్‌లో నడుపుతున్నాడు డ్రైవర్. అడవిలో నుండి ప్రయాణం అన్నీ చెట్లు, పొదలు, వాగులు, వొంకలు, అంతా ఆకుపచ్చని అందం. సూర్యుడు మబ్బుల చాటున ఉండడంవల్లా పందిరికింద చల్లదనం ప్రకృతి వడిలో పడుకున్నంత హాయి. అప్పుడే ఓ త్రాచుపాము నడి రోడ్డులో పరిగెత్తి చూస్తూ వ్యాన్ చప్పుడును గమనించి పక్క పొదల్లోకి జారుకుంది.

" పాము, పాము, పాము" పిల్లలు అరిచారు.

"పోయింది" అంటూడ్రైవర్ అదిపోయిన వైపు చూస్తున్నాడు.

"దాని భయం దానికే" క్లీనర్ అన్నాడు.

"వాతావరణం చల్లగా వుంది అందుకని అది బయటికి వచ్చి ఆడుతుంది"

"ఒక వేళ మన బండి చక్రాల కింద పడితే?" మూర్తి అడిగాడు.

"చస్తది" టీచర్ చెప్పాడు.

" చావకుంటే" జాన్సన్ అనుమానం వ్యక్తం చేశాడు.

" పగపడతది" రసూల్ చెప్పాడు.

"ప్రత్యేకంగా పగ అంటూ ఏమి వుండదర్రా, చూడండి నిన్నెవరైనా కొట్టితే నీకేమనిపిస్తుంది"

" బాధఅపిస్తుంది"

" అని పిచ్చి"

" మళ్లీ అతన్ని కొట్టాలనిపిస్తుంది"

" కొట్టాలనో తిట్టాలనో అనిపిస్తది ఆయన్ని గుర్తుపెట్టుకుంటే కలిసినపుడల్లా క్రితంలో కొట్టింది గుర్తుకొస్తది మనలో కోపం పుట్టుకొస్తది అవునా"

"అవును సార్'

" త్రాచుపాముల్లోను అంతే, వాటిని కొట్టినా, బాధించినా తిరగబడతాయి. పాముకు చేతులు లేవు మనం కొట్టినట్టు కొట్టలేవు కనుక కాటేస్తుంది. మన దగ్గర ఆయుధాలు వున్నట్టు వాటి దగ్గ విషపు కోరలుంటాయి. వాటిని ఏమీ అనకపోతే వాటంతవే పోతాయి యిప్పుడు పోలేదా అంతే" టీచర్ చెప్పాడు.

" వాటికి మనం భయపడినట్టు అవి మనలను చూసి భయపడతాయి" అన్నాడు డ్రైవర్. పాముల మీద చర్చ సాగుతూనే వుంది. విద్యార్థులు తమ అనుమానాలను తెలుసుకుంటున్నారు. వ్యాన్ వైపు చూస్తూ చేతులు ఊపారు దూరంగా కనిపిస్తున్న పిల్లలు.